సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 21 । మార్చి । 2023



51 రోజుల్లో న్యాయం చేస్తా

బండరావిరాల మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి అన్నారు. 8లో▸



ప్రజావాణితో పరిష్కారం

ప్రజావాణి ద్వారానే సమస్యలుసత్వరమే పరిష్కారం అవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తెలిపారు. 8లో▸

నలుగురి డిబార్

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి సోమవారం జరిగిన గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. హైదరాబాద్‌లోని ఓ పరీక్ష కేంద్రంలో ముగ్గురు, రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లిలోని ఓ ప్రైవేటు పరీక్ష కేంద్రంలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా అధికారులు పట్టుకున్నారు. మరోవైపు 2,33,048 విద్యార్థులకు గాను సుమారు 8,565 మంది గైర్హాజరయ్యారు.

న్యూస్‌రీల్

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్



సర్దార్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని సర్దార్‌నగర్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైద్య పరీక్షల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షలతోపాటు ఉచితంగా అద్దాలు పంపిణీ చేసే ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, డాక్టర్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు రెడ్డిగళ్ల సుమన్, వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



ఘట్టుపల్లిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డా. వెంకటేశ్వరరావు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఆరోగ్య వైద్యాధికారి డా.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఘట్టుపల్లి, గొల్లూరు గ్రామాల్లో సోమవారం శిబిరాన్ని ప్రారంభించి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,యువజన సంఘాల నాయకులు, ప్రజలు.. భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, ఎంపీడీఓ నర్సింహ, వైద్యులు రాధిక, శ్రీనివాస్, ఘట్టుపల్లి, గొల్లూరు గ్రామాల సర్పంచ్‌లు కోరుపోలు అనిత, మంద కవిత, కంటి వెలుగు కార్యక్రమం అధికారి డా. అజయ్, హెచ్‌ఈఓ నర్సింహారావు, 104 శ్రీనివాస్, రవి కుమార్ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యంతో పట్టుబడిన నిందితులు

పహాడీషరీఫ్: రేషన్ బియ్యాన్ని నల్ల బజార్‌కు తరలిస్తున్న ముగ్గురిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ అజ్మత్‌షా (27) ఆటో (టీఎస్ 34టి 4362)లో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా.. జల్‌పల్లి కార్గో రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా తమ యజమానులు షేక్ ఇమ్రాన్, గబ్బార్ ఆదేశానుసారం తరలిస్తున్నట్లు వెల్లడించాడు. పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ పఠాన్ హైదర్‌అలీ ఖాన్‌కు సమాచారం అందజేసి కాటేదాన్‌లోని గోడౌన్‌పై దాడులు నిర్వహించారు. అప్పటికే లోడ్ చేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీ, ఆటో, 33.5 టన్నుల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ అజ్మత్‌షా, షేక్ ఇమ్రాన్(29), అబ్దుల్ ఖాదర్‌ను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పేద ప్రజల దగ్గర కిలో రూ.5కు కొనుగోలు చేసి కర్ణాటకలో రూ.12కు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

ఎల్‌బీనగర్‌లో మరో ఫ్లైఓవర్

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌బీనగర్ జంక్షన్‌లో కుడివైపు ఫ్లై ఓవర్ త్వరలో ప్రారంభం కానుంది. మంత్రి కేటీఆర్ త్వరలో ప్రారంభించనున్నట్లు జీహెచ్‌ఎంసీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నగరంలో ట్రాఫిక్‌చిక్కుల పరిష్కారానికి ఎస్సార్‌డీపీ కింద పలు ఫ్లైఓవర్ల నిర్మాణం జరుగుతుండటం తెలిసిందే. ఇప్పటి వరకు 18 ఫ్లై ఓవర్లు వినియోగంలోకి రాగా ఇది 19వది. పొడవు 700 మీటర్లు, వెడల్పు 12 మీటర్లు. భూసేకరణ, యుటిలిటీస్ షిఫ్టింగ్‌తో సహ ఫ్లైఓవర్ నిర్మాణానికైన వ్యయం రూ.32 కోట్లు. ఈ ఫ్లై ఓవర్ వినియోగంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ నుంచి ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల మీదుగా వచ్చే ప్రజలతోపాటు నగరవాసులకు హయత్ నగర్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సదుపాయంగా ఉంటుంది.



అంబేడ్కర్‌కు తుది మెరుగులు



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ పనులు తుది దశకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సచివాలయం పక్కన 125 అడుగుల విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. ఇప్పటికే విగ్రహం పాదాల నుంచి భుజాల వరకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం తల భాగాలను అమరుస్తున్నారు. ఈ క్రతువు పూర్తయితే విగ్రహం దాదాపు ఆఖరు దశకు చేరినట్టే. ఒకవైపు సచివాలయం.. మరోవైపు భారీ అంబేడ్కర్ విగ్రహం.. ఇంకోవైపు అమరుల స్మారక స్తూపం.. ఈ మూడింటితో నెక్లెస్ రోడ్డు పరిసరాలు సరికొత్త అందాలను సంతరించుకోనున్నాయి.





సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

‘ఎస్‌ఎన్‌డీపీ’ పనులు త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్లలో వరద ముంపు సమస్య తలెత్తకుండా వర్షాకాలం ప్రారంభానికి ముందే ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు పూర్తి చేయాలని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం మీర్‌పేట, జల్‌పల్లి, బడంగ్‌పేట కార్పొరేషన్లకు సంబంధించిన అభివృద్ధి పనులపై కమిషనర్లు, ఇంజినీరింగ్, జలమండలి, విద్యుత్ శాఖ, హెచ్‌ఎండీఏ, ఎస్‌ఎన్‌డీపీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు సరిపడా తాగునీరు అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్లలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.13.80 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. అన్ని డివిజన్లలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మేయర్ ఎం.దుర్గదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బఫర్.. ఫియర్

ఫార్మాసిటీ పరిధిలో బఫర్‌జోన్‌పై ప్రచారం

- అధికారుల నుంచి కరువైన స్పష్టత
- నిలిచిపోయిన భూ క్రయవిక్రయాలు
- ఆందోళనలో రైతులు, రియల్టర్లు

యాచారం: ఫార్మాసిటీ బఫర్‌జోన్ ప్రచారం రైతులు, రియల్టర్ల కంటికి కునుకు లేకుండా చేస్తోంది. గూగుల్‌లో ఓ మ్యాప్ చక్కర్లు కొడుతుండడం, అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తోంది. 2016 నుంచి ప్రారంభమైన భూసేకరణ ప్రస్తుతం 70 శాతనికిపైగా జరిగింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారుల నుంచి విశాలమైన వంద అడుగుల రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఫార్మాసిటీకి సేకరించిన భూమిలో ప్రముఖ కంపెనీలకు భూములు కేటాయించడం కోసం బిట్లుబిట్లుగా వెంచర్లు చేసి రోడ్డు నిర్మాణ పనులకు గుట్టలు, రాళ్లను తవ్వి చదును చేశారు. ఫార్మాసిటీ వైపే చూపంతా ఉండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న బడా వ్యాపారులు చుట్టు పక్కల వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. ఉన్నతాధికారులు, రాజకీయ పెద్దలు, వ్యాపారులు 500 నుంచి రెండు వేల గజాల్లో ఆయా వెంచర్లలో ప్లాట్లు కొన్నారు. ప్రసుత్తం ఫార్మాసిటీ చుట్టూ మూడు కిలోమీటర్ల మేర బఫర్ జోన్ ఏర్పాటవుతుందనే ప్రచారంతో స్థానిక రైతులు, రియల్టర్లు ఆందోళనకు గురవుతున్నారు.

వెంచర్లకు అనుమతుల నిరాకరణ?

ఫార్మాసిటీ చుట్టూ మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసే హెచ్‌ఎండీఏ, డీటీసీపీ వెంచర్లకు పంచాయతీ అధికారులు అనుమతులు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. యాచారం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల తదితర మండలాల్లో ప్రసుత్తం వెయ్యి ఎకరాలకుపైగా కొత్తగా వందకు పైగా హెచ్‌ఎండీఏ, డీటీసీపీ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఈ వెంచర్లకు ప్రసుత్తం డీటీసీపీ, హెచ్‌ఎండీఏ అధికారులు అనుమతులు మంజూరు చేయడం లేదని తెలిసి రూ. వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. ఫార్మాసిటీతో ఎకరా భూమి రూ.కోటిన్నరకు పైనే డిమాండ్ ఉండేదని, ప్రస్తుతం బఫర్ జోన్ అంటుండడంతో సగానికి పైగా ధరలు పడిపోయినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. వెంచర్లలో గజం ధర రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పైగా పలికిందని, ప్రస్తుతం కొనేవారే రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.



గూగుల్‌లో చక్కర్లు కొడుతున్న ఫార్మాసిటీ బఫర్‌జోన్ మ్యాప్

పెద్దల దృష్టికి

బఫర్ జోన్‌పై స్థానికుల ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల రైతులు, రియల్టర్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పష్టత కోసం ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. కాగా, ఫార్మాసిటీ చుట్టూ బఫర్‌జోన్ వ్యవహారంపై స్థానికంగా జోరుగా చర్చ సాగుతోంది.

స్పష్టత లేదు

ఫార్మాసిటీ ఏర్పాటయ్యే బఫర్‌జోన్‌పై స్పష్టత లేదు. రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ అధికారులకే తెలుస్తుంది. ఫార్మాసిటీ చుట్టూ ఉన్న మండలాల్లో వ్యవసాయ భూములకు తహసీల్దార్లు ల్యాండ్ కన్వర్షన్ చేసి, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ కింద వెంచర్లకు అనుమతి కోరితే నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతులు ఇస్తాం. బఫర్‌జోన్‌పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పష్టత తీసుకుంటా.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

పార్టీకి పూర్వ వైభవం తేవాలి

- కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసి పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి చల్లా నర్సింహారెడ్డితోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ చేపడుతున్న హాత్ సే హాత్ జోడో యాత్రను ఇంటింటికీ తిరిగి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఇది మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకుంటే పార్టీ బలోపేతం కావటంతోపాటు ప్రజల్లో పార్టీపై విశ్వాసం పెరగుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని, ఈ రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్ ధరను కాంగ్రెస్ అధికారంలోఉన్న రాష్ట్రాల్లో రూ.500కే అందిస్తున్నామని ఇక్కడ కూడా అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, పామెన బీంభరత్, మధుసూదన్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, వీరేందర్ రెడ్డి, నాయకులు వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, గోనే ప్రతాప్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఉదయ్‌మోహన్ రెడ్డి, మద్దె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి
- టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై నిరసన దీక్ష

సాక్షి, రంగారెడ్డి జిల్లా : టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్–1 పేపర్ లీక్ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ ఐటీ, విద్యాశాఖ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి తక్షణమే రాజీనామ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రం డా బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడుతోందన్నారు. రద్దు చేసిన పరీక్షను అలస్యం చేయకుండా వెంటనే నిర్వహించాలన్నారు. కేసీఆర్ హయాంలో పరీక్షల నిర్వహణపై విశ్వాసం పోయిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదీష్, పార్టీ మండల అధ్యక్షుడు మాధవాచారి, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, అనంతయ్య, మధుమోహన్, యాదయ్య గౌడ్, నర్సింగ్ రాజ్, సుదర్శన్ యాదవ్, దేశ్యా నాయక్, రఘుపతి, సురేష్, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొక్క నర్సింహారెడ్డి

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు



నిందితుడు శ్రీకాంత్

శంకర్‌పల్లి: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. భార్యను గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఎల్వర్తి అనుబంధ గ్రామం కొజ్జగూడకు చెందిన సరిత (25)కు కొత్తపల్లికి చెందిన ఒగ్గు శ్రీకాంత్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. మొదట్లో వీరి కాపురం సజావుగానే సాగింది. కొంత కాలం తర్వాత మద్యానికి బానిసైన శ్రీకాంత్ భార్యను వేధించడం ప్రారంభించాడు. పక్షం రోజుల క్రితం గొడవ జరగడంతో సరిత పుట్టింటికి వెళ్లింది. ఇటీవల శ్రీకాంత్ కొజ్జగూడకు వెళ్లి తన భార్యను పంపాలని కోరడంతో అత్తింటి వారు నిరాకరించారు. దీంతో కొత్తపల్లికి వచ్చిన శ్రీకాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన శ్రీకాంత్ తల్లి వెంటనే కోడలు సరితకు ఫోన్ చేసింది. నువ్వు రాకపోతే చనిపోతా అంటున్నాడు.. ఇంటికి రావాల్సిందిగా వేడుకుంది. రెండు, మూడు రోజుల అనంతరం శ్రీకాంత్ కుటుంబ సభ్యులు సరిత తల్లిదండ్రులతో మాట్లాడి ఆమెను గ్రామానికి తీసుకొచ్చారు. కోపంతో రగిలిపోతున్న శ్రీకాంత్ ఆదివారం రాత్రి భార్య గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సరితకు ఐదేళ్ల వర్షిత్, మూడేళ్ల ప్రీతిక ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలు, ఆదేశానుసారం ఈ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పది గ్రామాలను కలిపి నిర్వహించే ఈ సమ్మేళనాలకు పార్టీకి చెందిన వార్డు సభ్యులు దగ్గర నుంచి ప్రజాప్రతినిధులందరూ హాజరుకావాలని సూచించారు. ఈ ఆత్మీయ సమ్మేళనాల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు మంగళవారం జిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఏప్రిల్ 20లోపు ఈ సమ్మేళనాలు పూర్తి చేసి, నియోజకవర్గ స్థాయిలో 25న విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ యువజన, విద్యార్థి, అనుబంధ సంఘాలను బలోపేతం చేసే దిశగా ప్రత్యేకంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

యాచారం: వడగళ్లు కురిసి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, కేసీతండా, చింతపట్ల గ్రామాల్లో సోమవారం ఆమె రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డితో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఏఏ పంటల్లో ఎంత మేర పెట్టుబడులు పెట్టారు.. ఎన్ని ఎకరాల్లో నష్టపోయారు.. పంట ఉంటే ఎంత ఆదాయం వచ్చేది అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగళ్లతో నష్టపోయిన పంటల వివరాల నివేదికను తెప్పించుకుంటున్నట్లు తెలిపారు. న్యాయమైన పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏడీఏ సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, విస్తరణ అధికారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



మంతన్‌గౌరెల్లిలో మామిడి తోటను పరిశీలించి బాధిత రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

నివేదికలు ఇవ్వాలి

మంచాల: ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి నివేదికలను తక్షణమే పంపించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతా రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీమంతన్‌గూడ, బోడకొండ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పంట నష్టం వివరాలను సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఏడీఏ సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ, ఇన్‌చార్జి కోటేశ్వర్‌రావు, ఎంపీపీ నర్మద, గ్రామ సర్పంచ్ అలివేలు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలి

వడగళ్ల వర్షాలకు పంట దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బోడకొండకు చెందిన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెక్టరేట్‌కు వెళ్లారు. డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దండెం రాంరెడ్డి, సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్ గౌడ్, పార్టీ మండల కార్యదర్శి హతిరాం పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బస్సు

ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

నందిగామ: జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను వెనకాల నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నందిగామ శివారులోని బైపాస్ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన సంపంగి నర్సింహులు తన ట్రాక్టర్‌ను నడుపుకొంటూ 44వ నంబర్ జాతీయ రహదారిపై తిమ్మాపూర్ వైపు వెళ్తున్నాడు. ట్రాక్టర్ నందిగామ శివారులోని బీపీ పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే వెనకాల నుంచి వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. వేగంగా ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ నర్సింహులు తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ ముందు భాగం చక్రాలు విరిగిపోగా, బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు. కాగా, జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో ఇన్‌స్పెక్టర్ రామయ్య తన సిబ్బందితో కలసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

షాద్‌నగర్‌రూరల్: హత్యాయత్నం కేసులో నిందితులకు సోమవారం షాద్‌నగర్ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష,, ఒక్కొక్కరికి రూ.25వేల జరిమానా విధించినట్లు పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులోని శ్రీ వెంకటేశ్వర వేబ్రిడ్జి సమీపంలో మే 11, 2016లో బంగారి చెన్నయ్య, బంగారి మల్లేశ్, బంగారి నర్సిం ముగ్గురు వ్యక్తులు భూ వివాదం నేపథ్యంలో బర్మలి జంగయ్య, బర్మలి రమేశ్‌తో ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా గొడ్డలితో దాడి చేశారు. ఈ నేపథ్యంలో బర్మలి జంగయ్య కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్పట్లో హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. షాద్‌నగర్ కోర్టులో విచారణ చేపట్టి తర్వాత నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్ జడ్జి తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. నిందితులు బంగారి చెన్నయ్య, బంగారి మల్లేశ్‌లను హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు. అయితే నిందితుల్లో బంగారు నర్సింలు ఇటీవల మృతి చెందాడు.

51 రోజుల్లో న్యాయం చేస్తా

లేకుంటే నేనే దీక్షకు దిగుతా

- మైనింగ్ జోన్ భూ నిర్వాసితులకు బీఆర్‌ఎస్ నేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హామీ



దీక్షలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బండరావిరాల మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన రైతులకు 51రోజుల్లో న్యాయం జరిగేలా చూస్తానని బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఒకవేళ నిర్ణీత సమయంలో న్యాయం జరగకపోతే బాధితులకు మద్దతుగా తానే దీక్ష చేస్తానని ప్రకటించారు. మైనింగ్‌జోన్‌లో భూములు కోల్పోయిన రైతులు తమకు నష్టపరిహారం చెల్లించాలని, క్రషర్లను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ 217 రోజులుగా సద్దుపల్లి కూడలిలో భూ నిర్వాసితుల ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. నాలుగు గంటల పాటు దీక్షలో కూర్చున్నారు. నిర్వాసితులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాల మేరకు 50మంది రైతులకు ఎకరాకు రూ.7.40లక్షల చొప్పున నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని చెప్పారు. మిగిలిన 159 మంది రైతులకు తగిన పరిహారం అందేలా ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, బీఆర్‌ఎస్ తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

It is hereby informed to all the General Public that our clients 1. Smt. Sidduluri Indramma W/o S. Bandaiah, D/o Late Antharam Rukkaiah, aged about 40 years, Occ: Housewife, R/o. H.No.3-25/1, Aknapuram Village, Nawabpet Mandal, Vikarabad District-501 101 and others have filed the suit for Partition and Separate Possession against the Smt. Antharam Balamma and others for partition before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District at Chevella, vide OS.No.88/2020, our clients Objection for Issuance of Registration and alienation of the agriculture land bearing Sy.No. 163, admeasuring Ac. 8-14 gts, Situated at Mudimyal Village, Chevella Mandal, Ranga Reddy District, in favour of any Third Parties until the case is over.

SUIT SCHEDULE PROPERTY

All that the agricultural land bearing Sy.No.163, admeasuring Ac. 8-14 gts, situated at Mudimyal Village, Chevella Mandal, Ranga Reddy District as bounded by

East : Land of Sy.No.163/part
West : Land of Sy.No.163/part
North : Land of Sy.No.164 and 165
South: Land of Sy.No.163/part

Hence, this Public notice.

Sd/- MAHENDER NANDARI
Advocate
Off. & Resi.: H.No.11-73/1, Plot No.25, Balajinagar Colony, Vikarabad Road, Chevella, Rangareddy Dist-501503, T.S.
Cell: 9849669847

గాజుల కోసం వెళ్లి.. అదృశ్యమై..



ఫాతిమా (ఫైల్)

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైంది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన జావిద్ ఖాన్ కుటుంబం ఐదు నెలల క్రితం వాదే ముస్తఫా బస్తీకి వలస వచ్చింది. అతని కుమార్తె సానియా ఫాతిమా(17) నెల రోజుల నుంచి గాజులకు రాళ్లు అతికించే పని చేస్తుంది. ఈ నెల 19న రాత్రి 8 గంటల సమయంలో గాజులు తీసుకొస్తానంటూ బయటికి వెళ్లిన సానియా తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. తల్లి సుల్తానా పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా 9490617241 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



ఎక్వాయిపల్లిలో కాంగ్రెస్ నేతల జోడోయాత్ర

యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్

కడ్తాల్: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. హాత్ సే హాత్ జోడోయాత్రలో భాగంగా సోమవారం ఎక్వాయిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి రవికాంత్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండావిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కరపత్రాలు పంచుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రవికాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల పంట రుణాల మాఫీతో పాటు, రూ.5లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, రూ.500కే వంట గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చలేదన్నారు. ధరణితో పేరుతో రైతులను దగా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో నిరుద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాం, మంత్రి కేటీఆర్ పేపర్ లీకేజీలో సీబీఐతో విచారించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ ఉమావతి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, ఎన్ఎస్‌యూఐ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు అన్వేశ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, నాయకులు మహేశ్, యాదయ్యగౌడ్, కరుణాకర్, విజయ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు, ఒకరి మృతి



రమేశ్ మృతదేహం

ఆమనగల్లు: ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మండల పరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన రమేశ్ (36) ఆమనగల్లు పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులో ట్రాక్టర్‌ను యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై కూర్చున్న మంగళపల్లి గ్రామానికి చెందిన రమేశ్ కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య తెలిపారు.

వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు చోరీ

మీర్‌పేట: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలో నుంచి ఓ దుండగుడు బంగారు గొలుసును అపహరించారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నందనవనం మజీద్‌గల్లీకి చెందిన ఉప్పుల జానకమ్మ (80) సోమవారం ఉదయం ఇంటికి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని ఒక తులం గొలుసును తెంచుకుని పారిపోయాడు. ఈ క్రమంలో జానకమ్మ కిందపడగా స్వల్ప గాయాలై రోడ్డుపై పడిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



విజయ్ జైస్వాల్

పహాడీషరీఫ్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్ జైస్వాల్ అలియాస్ కల్లు(36) పహాడీషరీఫ్ పాత కమాన్ సమీపంలో గంజాయిని చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.500ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

భార్యను వేధిస్తున్నాడని యువకుడిపై దాడి

రాజేంద్రనగర్: భార్యకు తరచూ ఫోన్ చేసి వేధిస్తుండడంతో భరించలేని భర్త తన కుమారుడితో కలిసి ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డ సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన నరహరిచారి(46) భార్య మృతి చెందడంతో కొడంగల్ కోజీ ప్రాంతానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరు లంగర్‌హౌజ్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. కోజీ ప్రాంతానికి చెందిన రవి అనే యువకుడు తరచు నరహరిచారి భార్యకు ఫోన్ చేస్తూ వేధిస్తున్నాడు. ఒకే గ్రామానికి చెందిన ఇరువురికి వివాహం జరగకముందే పరిచయం ఉంది. దీన్ని సాకుగా తీసుకుని రవి మహిలను వేధించడం మొదలెట్టాడు. ఈ విషయాన్ని నరహరిచారి తన మొదటి భార్య కుమారుడు హరిప్రసాద్‌చారి(21)కి తెలిపి బాధపడ్డాడు. దీంతో సోమవారం మధ్యాహ్నం రవి లంగర్‌హౌజ్ ప్రాంతానికి వచ్చిన విషయం తెలుసుకున్న నరహరిచారి, హరిప్రసాద్‌చారిలు అతడి కోసం కాపుకాశారు. లంగర్‌హౌజ్ నుంచి ద్విచక్ర వాహనంపై అత్తాపూర్ ప్రధాన రహదారి గూండా వెళ్తున్న సమయంలో వెంబడించారు. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం.173 వద్దకు రాగానే అడ్డగించి ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారు. నడిరోడ్డుపై దాడి జరుగుతుండడంతో వాహనాదారులు, స్థానికులు అడ్డగించి నరహరిచారి, హరిప్రసాద్‌లను పట్టుకుని చితకబాదారు. అనంతరం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ రవిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారి హరిప్రియ

రెవెన్యూ అధికారి హరిప్రియ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి ద్వారానే సమస్యలుసత్వరమే పరిష్కారం అవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలోప్రజలనుంచి ఆమె ఫిర్యాదులు తీసుకున్నారు . ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖలపై 90 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

కుంటను కబ్జా నుంచి కాపాడండి
ప్రజావాణిలో గూడూరు గ్రామస్తుల ఫిర్యాదు

కందుకూరు: కుంట కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మండల పరిధిలోని గూడూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిందం శ్రీశైలం, కె.కుమార్, పి.కృష్ణ, కె.సురేందర్, డి.జంగయ్య తదితరులు మాట్లాడారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 3, 5లలో మొత్తం 23 ఎకరాల భూమి ఉందన్నారు. అందులోని పూచర్ల కుంటను ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఫాంలాండ్ పేరుతో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో కుంట కట్ట, తూము, అలుగు మొత్తం ఆక్రమించిందని పేర్కొన్నారు. నీరు నిండినప్పుడు బయటికి పోకుండా ఎఫ్‌టీఎల్‌ని కలుపుకొని ప్రహరీ సైతం నిర్మించారన్నారు. గూడూరు–లేమూరు మార్గంలో లో–లెవల్ బ్రిడ్జి నుంచి నీరు పోయే మార్గం లేకుండా మట్టితో నింపారన్నారు. వెంటనే చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో నర్సింలు

టీడీపీ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు

షాద్‌నగర్: టీడీపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు అన్నారు. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి నాయకులు, కార్యకర్తలు పట్టుకొమ్మలాంటి వారన్నారు. టీడీపీ సిద్ధాంతాలను, అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నాయకులు తగిన విధంగా కృషి చేయాలని చెప్పారు. పార్టీ నేతలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పై పోరాడినప్పుడే పార్టీ బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, పాండు, గణేశ్, లింగం, రాజు, అమరేశ్, సురేశ్, జనార్దన్, కేశవులు, రమేశ్, బాలు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరి



నియామక పత్రం తీసుకుంటున్న యాదగిరి

మంచాల: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచాల మండలం చీదేడ్ గ్రామానికి చెందిన బోద్రమోని యాదగిరి ముదిరాజ్ నియామకం అయ్యారు. సోమవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల సమస్య పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు.